# ఉపఎన్నికల్లో త్యాగధనుల గెలుపు - తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మేలి మలుపు

కేంద్ర హోంమంత్రి చిదంబరం డిసెంబర్ 9, 2009 నాటి ప్రకటనతో 60 ఏళ్ళ తెలంగాణ పోరాటం తెరపిన పడ్డదనుకున్నం. తెలంగాణపై రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక దోపిడీ అంతమయ్యిందనుకున్నం. తెలంగాణలో నిజమైన ప్రజాస్వామిక, ప్రగతిశీల, సామ్యవాద పాలనకు తెర లేచిందనుకున్నం. కాని ఏం జరిగింది? నోట్లో వేసుకున్న తీపి గొంతులోకి దిగకముందే తెగిపడిన తలను మళ్ళీ అతికించుకొన్న పదితలల రాక్షసుడిలా, చేతిలోనుండి మళ్ళీ చెట్టెక్కిన భేతాళుడిలా కృత్రిమ సమైక్యవాదం వికటాట్టహాసం చేసింది. కోస్తాంధ్ర, సీమ నాయకుల ఒత్తిడికి తలొగ్గిన కేంద్రం స్పష్టమైన తన హామీనుండి వెనక్కి తగ్గింది. డిసెంబర్ 23 నాడు విస్తృత స్థాయి చర్చ జరగాలంటూ రెండవ ప్రకటన చేసింది. చేతికందిన పంటను మింగుదామని ఉరిమిందెవడు? కంచంలో బువ్వ కడుపులోకి చేరకుండా నోటి బుక్క ఎత్తగొట్టిందెవడు? 'దేవత' యిచ్చిన వరాన్ని అడ్డుకున్న పూజారెవడు? వెలిగిన ఆశాదీపాన్ని ఆర్పజూసిందెవడు? అంటూ యావత్ తెలంగాణ గుడ్లురిమింది. ఆక్రోశపడ్డది. ఒక్కతాటిపైకి వచ్చింది.

విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు జేఏసీలుగా ఏర్పడ్డరు. ముల్లును ముల్లుతోనే తియ్యాలని తీర్మానించిన్రు. గ్రామ గ్రామాన ప్రజలంతా తెలంగాణ నేతలు కూడా రాజీనామా చేయాలని హుకుం చేసిన్రు. తెలంగాణ నాయకుల అలసత్వాన్ని చూసి సిగ్గుపడ్డ తెలంగాణ యువకులు, ముఖ్యంగా విద్యార్థులు, ఆత్మ త్యాగాలకు దిగిన్రు. ఆ విధంగానైనా వారికి కర్తవ్యం బోధపడుతుందనుకున్రు. అమరుల శవాలపై ప్రమాణాలు చేసిన వారు తమ చిత్తశుద్ధి చూపాల్సిన సమయం వచ్చేసరికి మొహం చాటేసిన్రు. 119 ఎమ్మెల్యేలకు కేవలం 15 మంది రాజీనామా చేసిన్రు. అందులో ఇద్దరు కాంగ్రెస్, ఒక పీఆర్పీ నాయకుడి రాజీనామాలు ఆమోదించకుండా మరోసారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన్రు. తాడో పేడో తేల్చుకుంటమని ప్రగల్భాలు పలికిన నేతలు ఢిల్లీకి పులుల్లా పోయి పిల్లుల్లా తిరిగొచ్చిన్రు. అసలు సిసలు తెలంగాణ వాదులెవరో ప్రజలకు స్పష్టంగా ఎరుకైంది.

తెలంగాణ ఉద్యమం వివిధ సందర్భాల్లో వివిధ రూపాలు తీసుకుంది. ఈ దఫా తెలంగాణ ఉద్యమంలో రాజీనామాలను ఆయుధంగా తీసుకోవాలన్నది జేఏసీల సమిష్టి నిర్ణయం. అయితే మెత్తటోన్ని మొత్తినట్లు రాజీనామా చెయ్యని వాళ్ళు రాజీనామా చేసినవాళ్ళనే విమర్శించడం మొదలుపెట్టిన్రు. వారిపై పోటీకి దిగుతామని సిద్ధపడ్డరు. రాత్రికి రాత్రి వీర తెలంగాణవాదులుగా తయారైన్రు.

1. తెలంగాణ తెచ్చేదీ, యిచ్చేదీ మేమేనంటోంది ఓ పార్టీ. అటువంటప్పుడు అడ్డేవరు? ప్రకటించిన నిర్ణయంనుంచి కేంద్రం వెనక్కిపోతే ఎందుకు ఆపలేకపోయిన్రు? కోస్తాంధ్ర, సీమ నాయకులు అధిష్టానాన్ని ధిక్కరించినపుడు వీరెందుకు ఆ పని చేయలేకపోయిన్రు?

2. కేంద్ర ప్రభుత్వ అస్పష్ట ప్రకటనలకు వందలాదిమంది ప్రాణాలు బలితీసుకుంటుంటే , తేగలిగేవాళ్ళూ, ఇవ్వగలిగే వాళ్ళూ అయిన మీరు ఏం చేస్తున్నారు? అంటే అమాయకుల ప్రాణాలు కాపాడగలిగే స్థితిలో ఉండి కూడా అచేతనంగా ఉన్న వీరు పోయిన ప్రాణాలు మళ్ళీ తేగల్గుతారా? వారి ఆత్మత్యాగాలకు తమదే బాధ్యత అని ఒప్పుకుంటారా?

3. ఇచ్చేదీ, తెచ్చేదీ మేమే అనటం అహంకారం, అప్రజాస్వామికం కాదా? ప్రజా ఉద్యమాలను పోరాటాలను అవమానించటం కాదా? ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ విధానాలు కావాలి. అలాకాకుండా తాము ఇచ్చినపుడు తీసుకోవాలన్నట్టు మాట్లాడటం రాచరికపు, భూస్వామ్య లక్షణం కాదా?

4. కూట్లో రాయి తియ్యలేనోడు ఏట్లో రాయితీస్తనన్నట్టు ప్రణబ్ ముఖర్జీకమిటీకి, శ్రీకృష్ణ కమిటీకి కనీసం తమ అభిప్రాయాన్ని చెప్పని పార్టీ తెలంగాణ తెచ్చేదీ, యిచ్చేదీ మేమేనంటే ఎట్లా నమ్మాలి?

5. మరో పార్టీ ఎక్కడా కనీ వినీ ఎరుగని రాజకీయ నాటకం ఆడుతోంది. రెండు కళ్ళ విధానంతో రెండు నాల్కలతో మాట్లాడుతోంది. ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోంది. ప్రజల ఓపిక నశించి మూడో కన్ను తెరవకముందే 2009 ఎన్నికల్లో వారు తీసుకున్న విధానానికి కట్టుబడి కోస్తాంధ్ర, సీమ నాయకులను తొవ్వకు తెచ్చుకోవాలి. లేదంటే ప్రజల ఆగ్రహజ్వాలలకు ఆ పార్టీ అవకాశవాద రాజకీయం మాడి బూడిదవుతుంది.

6. తెలంగాణలో వందల మంది అమరులైతే ఆ పార్టీ అధ్యక్షుడికి కనీసం సంతాపం ప్రకటించడానికి నోరు పెకలదు, పరామర్శించడానికి కాళ్ళు కదలవు. తెలంగాణ నేతలు మహబూబాబాద్ ఘటనను ఖండిస్తామంటే రెండు చెవులూ అవిటివైపోతయి.

7. మహారాష్ట్ర, కర్ణాటక కట్టే ప్రాజెక్టుల వల్ల తెలంగాణ ఎడారవుతుందని మొసలి కన్నీరు కార్చే బాబుకు పోలవరం, పులిచింతల, పోతిరెడ్డిపాడు కన్పించవా? రెండిటివల్లా తెలంగాణకు నష్టమైతే ఒక పక్కకే చూపు ఎందుకు పోతోంది? ఏ రాయయితేంది తెలంగాణ నెత్తి పగలడానికి? బాబ్లీని అడ్డుకోడానికి  బయలుదేరిన బాబు పోలవరం, పోతిరెడ్డిపాడు యాత్రలకు సిద్ధమేనా? ఒక రాష్ట్రంలోని రెండు ప్రాంతాల మధ్య సమస్యను పరిష్కరించలేని పార్టీ రెండు రాష్ట్రాల వివాదంలో తలదూర్చడం ఎవరి ప్రయోజనాల కోసం?

8. తెలుగు ప్రజల ఆత్మాభిమానం అంటూ ఊదరగొట్టే పార్టీ తెలంగాణ ఆత్మగౌరవ పోరాటాన్ని ఎందుకు గుర్తించదు? తెలంగాణవారిని వారు తెలుగువాళ్ళుగా గుర్తించడం లేదా?

9. అమరవీరుల కుటుంబీకులను పోటీకి దించాలన్న వాదనను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వ్యతిరేకశక్తులు తెర మీదకు తెచ్చాయి. అమరుల మీది అభిమానంతో కొందరు దీని వెనక ఉన్న కుట్రను అర్థం చేసుకోలేక పోయారు. అమరులు తెలంగాణకోసం ఆత్మత్యాగాలు చేశారు, పదవుల కోసం కాదు. అయినా నాల్గువందల మందికి పైగా తెలంగాణకోసం అమరులైతే కేవలం 12 మందికే సీట్లు ఎలా ఇవ్వగలుగుతాం? అంటే అమరుల త్యాగాలను తూచే పనికి పూనుకుందామా? అమరుల కుటుంబాల మధ్య పంచాయతీ పెడదామా?

10.  ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఎవరు ఓడినా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు ఉద్యమం ఆగదు. కానీ, చూస్తూ, చూస్తూ ఉద్యమాన్ని నీరు కారుద్దామా? కూచున్న కొమ్మను నరుక్కుందామా? 2009 ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలూ తెలంగాణకు అనుకూలమంటే, స్థానిక సమస్యలు, అభ్యర్థులను బట్టి ఓటేసినం. తెలంగాణ రాష్ట్ర సమితికి 10 సీట్లే వచ్చినయి కాబట్టి తెలంగాణను ప్రజలు కోరుకోవడంలేదంటూ కోస్తాంధ్ర, సీమ నాయకులు వితండవాదం చేసిన్రా లేదా? ఇపుడు ఈ 12 సీట్లలో ఒక్కటి తగ్గినా మళ్ళీ అదే దుష్ప్రచారం మొదలుపెడ్తరు.

11. ఇవి పార్టీలకోసం జరుగుతున్న ఎన్నికలు కావు. ఆడిన మాటకు నిలబడి ఉద్యమాన్ని బలోపేతం చేయడం కోసం పదవుల్ని త్యాగం చేసిన వారికి, తాత్కాలిక, స్వార్థపూరిత ప్రయోజనాలకోసం ఇచ్చిన మాటను పక్కన పెట్టిన వారికీ మధ్య జరుగుతున్న పోరాటం. ఒక్కమాటలో ఇవి తెలంగాణవాదులకు, తెలంగాణ వ్యతిరేకశక్తులకు మధ్య జరుగుతున్న ఎన్నికలు.

12. ఎంత చిన్న పదవిని కాపాడుకోడానికైనా అడ్డమైన గడ్డి తినే రాజకీయ నాయకుల్ని చూస్తనే ఉన్నం. అట్లాంటిది రాష్ట్రంలో అత్యున్నత ప్రజాప్రతినిధులసభ సభ్యత్వాన్ని తెలంగాణ ఉద్యమం కోసం గడ్డి పోచల్లా విడిచిపెట్టిన రాజకీయనాయకులను ఓడిద్దామా? ఎన్నో ఏళ్ళ ప్రజాజీవితం తర్వాత, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మొట్ట మొదటిసారి ఎన్నికైన  ఎమ్మెల్యేలు రాజీనామా చెయ్యాలంటే ఎంత దమ్ముండాలి? తెలంగాణ పట్ల ఎంత నిబద్ధత ఉండాలి? అలాంటి వారి నెత్తిన పాలు పోద్దామా? లేక నట్టేట ముంచుదామా? అదే జరిగితే తెలంగాణకోసం పోరాడటానికి రేప్పొద్దున ఏ రాజకీయ నాయకుడైనా ముందుకొస్తడా?

13. తెలంగాణను సతాయిస్తే ఏం జరుగుతుందో మహబూబాబాద్ ఘటన రుజువు చేసింది. కానీ, తెలంగాణకు ఆవేశమే కాదు ఆలోచన ఉందని చూపెట్టాల్సిన కాలమిది. రాజీనామాలు పెట్టిన వాళ్ళపై పోటీకి దిగిన వారికి డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడించి, తెలంగాణల దొంగ ప్రమాణాలు, దొంగ వాగ్దానాలు నడవయని నిరూపించాలి. మళ్ళీ వార్డు మెంబరుగా పోటీ చెయ్యాలన్నా పదిసార్లు ఆలోచించేటట్లు చిత్తుగా ఓడగొట్టాలి.

14. చివరిగా, తెలంగాణ ఉద్యమంలో గత 60 ఏళ్ళుగా వేలమంది ప్రాణాలు వదిలిన్రు. వచ్చిన తెలంగాణను కోస్తాంధ్ర, సీమ నాయకులు దొంగ రాజీనామాలతో అడ్డుకుంటే, అవే రాజీనామాలతో కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ నాయకులను డిమాండ్ చేసినం. తెలంగాణ నాయకులు రాజీనామాలపై రోజుకొక మాట మాట్లాడుతుంటే అనేక మంది ఆత్మ త్యాగాలకు పాల్పడ్డరు. బలిదానాలు వీళ్ళ కళ్ళు తెరిపిస్తయని భ్రమ పడ్డరు. కానీ ఆత్మహత్యలతో కేంద్రం దిగిరాదని, బండ రాళ్ళవంటి నాయకుల గుండెలు కరగవని నిరూపితమైంది. అందుకే బలిదానాలు వద్దు, ప్రజాస్వామికంగా పోరాడదామని నిజమైన తెలంగాణవాదులు రాజీనామా చేసిన్రు. అందుకే వాళ్ళను మళ్ళీ గెలిపించుకుందాం. అట్ల కాకుంటే తెలంగాణకోసం అమరులు కార్చిన కన్నీరు దున్నపోతుల మీద పడ్డ వానయితది, అమరుల జై తెలంగాణ నినాదం అరణ్యరోదనైతది, అమరులు కాలిన చితిమంటలు దొంగ నాయకులకు చలిమంటలైతయి, అమరుల శవాల గుట్టలు నాయకులకు పదవి ఎక్కేతందుకు మెట్లయితయి.

15. అందుకే అమరుల త్యాగాలకు నివాళిగా, వారి ఆత్మలకు శాంతి కలిగేందుకు, తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు పదవీత్యాగం చేసిన వారిని గెలిపించుకుందాం.

**తెలంగాణలో అవకాశవాద రాజకీయాలను బొంద పెడదాం**

**పదవీత్యాగం చేసిన వారినే అందలం ఎక్కిద్దాం**

జై తెలంగాణ! జై జై తెలంగాణ!! జై హింద్!!!

తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం